క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

గణపతికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న గణపతి

పెందుర్తి: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని పెదగాడిలోని స్వర్ణాకర్షణ కాలభైరవ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలోని సంకటహర గణపతికి అభిషేకాలు నిర్వహించారు. కాలభైరవ ఉపాసకులు విశ్వసాయి గురూజీ చేతుల మీదుగా పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి అభిషేకాలు



చంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు, మహిళలు ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో స్వామికి అర్చన చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న కృష్ణంనాయుడు

పరవాడ: వాడచీపురుపల్లి శివారు గొరుసువానిపాలెంలో నిర్మాణంలో ఉన్న సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఆలయానికి ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు కూంద్రపు కృష్ణంనాయుడు రూ.5,116 విరాళం ఇచ్చారు. ఆలయ నిర్వాహకులకు విరాళాన్ని నగదు రూపంలో సోమవారం అందించారు. కార్యక్రమంలో పరవాడ వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, గొరుసు అప్పలరాజు, వెంకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కిన 8 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.80 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మద్యం సీసాల లెక్కల్లో అవకతవకలు అవాస్తవం

- గోపాలపట్నం సీఐ ప్రభాకర్



గోపాలపట్నం: మద్యం సీసాల్లో అవకతవకలు చేశారని వాట్సాప్‌లో వస్తున్న వదంతులు అవాస్తవమని గోపాలపట్నం సీఐ ఎన్‌వీ ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 6న ఇందిరానగర్, లక్ష్మీనగర్‌లో కార్డన్‌సెర్చ్ చేపట్టామన్నారు. అందులో భాగంగా రెండు బెల్టు షాపుల్లో 26 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. అయితే ఇందులో స్టేషన్ రైటర్ చేతివాటం ప్రదర్శించారన్న కోణంలో వాట్సాప్ మెసేజ్ వైరల్ చేశారని తెలిపారు. ఇలాంటి తప్పుడు ప్రచారం వల్ల సిబ్బంది మానసికంగా ఇబ్బంది పడతారని.. ఆ ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇలాంటివి వైరల్ చేయొద్దని ఆయన కోరారు.

ఫోకస్

దాహం తీర్చని ఆర్వో ప్లాంట్లు



ముత్యాలమ్మపాలెంలో మూడేళ్ల నుంచి మరమ్మతులతో మూలకు చేరిన ఆర్వో ప్లాంటు



మరమ్మతులతో మూలకు చేరిన వెన్నలపాలెం ఆర్వో ప్లాంట్



రంధ్రాలు పడి నీరు వృథాగా పోతున్న దృశ్యం

వేసవి పోయి వర్షాకాలం వచ్చినా పరవాడ మండల వాసులకు తాగునీటి వెతలు తీరలేదు. ఇక్కడి పరిశ్రమల సీఎస్సార్ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు చాలా వరకు మరమ్మతులకు గురై మూలకు చేరాయి. వాటి నిర్వహణ తమ పరిధిలో లేదని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖాధికారులు చెప్తున్నారు. పర్యవేక్షించాల్సిన పంచాయతీలు నిధుల కొరతతో, కనీస మొత్తంతో జరిగే మరమ్మతులూ చేపట్టలేకపోతున్నాయి. దీంతో నెలలు, ఏళ్ల తరబడి ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది.

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మా యాజమాన్యాలు తమ సీఎస్సార్ నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి కేంద్రాలు(ఆర్వో ప్లాంట్లు) మరమ్మతులతో మూలకు చేరాయి. దీంతో పరిశ్రమల లక్ష్యం నీరుగారిపోవడంతోపాటు, గ్రామీణ ప్రజలు స్వచ్ఛమైన తాగునీటికి మైళ్ల దూరంలో ఉన్న ప్రైవేట్ వాటర్ ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తోంది. రిపేర్లతో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేపట్టి త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

ఏడాదే.. నిర్వహణ బాధ్యత

ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, వెంకటాపురం, గొరుసువానిపాలెం, బొట్టవానిపాలెం, ధర్మారాయుడుపేట, రావాడ, పరవాడ, వెన్నలపాలెం, కలపాక గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసింది. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకంలో భర్నికం, ఫార్మాజెల్ ఆర్థిక సాయంతో గొర్లివానిపాలెం బీసీ కాలనీ, విర్కో పరిశ్రమ సాయంతో దలాయిపాలెంలో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. వీటిలో వెన్నలపాలెం, గొర్లివానిపాలెం, కలపాక, దలాయిపాలెం గ్రామాల్లోని ఆర్వో ప్లాంట్లు మూలకు చేరాయి. ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి ఏడాదిపాటు వాటి నిర్వహణకు తాము బాధ్యత వహిస్తామని సంబంధిత పరిశ్రమలు చెప్తున్నాయి. ఆ తర్వాత ఆ బాధ్యత గ్రామ పంచాయతీలదేనని స్పష్టం చేస్తున్నాయి.



గొర్లివానిపాలెం బీసీ కాలనీలో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్



కలపాకలో రిపేర్లతో వృథాగా పడివున్న వాటర్ ప్లాంట్

నెలల తరబడి తప్పని తిప్పలు

- వెన్నలపాలెంలో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మోటారు కాలిపోవడంతోపాటు వాటర్ ట్యాంకుకు రంధ్రాలు పడి, నీరు వృథాగా పోతోంది. ప్లాంటును వినియోగంలోకి తీసుకురావాలంటే సుమారు రూ.2 లక్షలు కావాలి.
- గొర్లివానిపాలెం బీసీ కాలనీలో 2016లో ఫార్మాజెల్ పరిశ్రమ యాజమాన్యం ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురైంది. ఏళ్ల తరబడి ప్లాంట్‌లో రిపేర్లు చేయని కారణంగా యంత్ర సామగ్రి తుప్పుపట్టి పూర్తిస్థాయి రిపేర్ చేయాల్సిన పరిస్థితి.
- ఎన్టీపీసీ సౌజన్యంతో 2015లో కలపాకలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మూలకు చేరింది. గ్రామంలో బోర్లలో కలుషిత నీరు రావడంతో ప్రజలు తాగునీటి కోసం వేర్వేరు ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లపై ఆధారపడుతున్నారు.
- వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెంలో విర్కో లేబొరేటరీస్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ కూడా రిపేర్లతో మూలకు చేరింది.
- ముత్యాలమ్మపాలెం ఆర్వో ప్లాంట్‌ను 2016లో రూ.12 లక్షలతో నిర్మించారు. మూడేళ్ల నుంచి మరమ్మతులతో మూలకు చేరింది. గ్రామస్తులు తాగునీటి కోసం 2 కి.మీ. దూరంలో ఉన్న వాడచీపురుపల్లి ఆర్వో ప్లాంట్‌పై ఆధారపడాల్సి వస్తోంది.
- అయితే ఆర్వో ప్లాంట్ల నిర్వహణ ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలోకి రాదని ఆ శాఖ ఏఈ షణ్ముఖ తెలిపారు. వాటి మెయింటెనెన్స్, రిపేర్లను గ్రామ పంచాయతీలే చూసుకోవాలని స్పష్టం చేశారు.

మూడు నెలలుగా ఇబ్బందులు



ఆర్వో ప్లాంటు రిపేర్లతో మూలకు చేరడంతో మూడు నెలల నుంచి తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నాం. పరవాడ, గొర్లివానిపాలెం ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకొని దప్పిక తీర్చుకుంటున్నాం. మూలకు చేరిన ఆర్వో ప్లాంట్‌కు వెంటనే రిపేర్లు చేసి తాగునీరందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బండారు సన్యాసిరావు, వెన్నలపాలెం

దూరాభారం, అధిక వ్యయం



స్థానిక ఆర్వో ప్లాంట్‌లో 20 లీటర్ల వాటర్ క్యాన్ రూ.5కే దొరికేది. ఇప్పుడు దూర ప్రాంతాలకు వెళ్లి అదే క్యాన్‌కు అదనంగా రూ.10 నుంచి రూ.15 చెల్లించాల్సి వస్తోంది. దూరాభారం, చేతి చమురు వదులుతోంది. ఫార్మాజెల్ పరిశ్రమ యాజమాన్యం ఆర్వో ప్లాంట్ మరమ్మతులు చేపట్టి ఇబ్బందుల్ని తొలగించాలి.

– బి.రామునాయుడు, గొర్లివానిపాలెం

మంచినీటి పథకాన్ని ప్రారంభించండి



గ్రామంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని వెంటనే ప్రారంభించి తాగునీటి ఇబ్బందుల్ని తొలగించాలి. రిపేరుకొచ్చిన ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేపట్టి రక్షిత మంచినీటి పథకం నుంచి నీటిని ప్రజలకు అందించాలి. అధికారులు వేగంగా ఈ చర్యలు తీసుకోవాలి.

– పప్పు సత్యవతి, కలపాక

నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే ఉజ్వల భవిష్యత్

- గోవా ఇంటర్నేషనల్ లా వర్సిటీ వీసీ ఆచార్య ఆర్.వెంకటరావు





మాట్లాడుతున్న గోవా లా వర్సిటీ వీసీ వెంకటరావు, పాల్గొన్న నూతన బ్యాచ్ విద్యార్థులు, తల్లిదండ్రులు

సబ్బవరం: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని గోవా అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఆర్.వెంకటరావు సూచించారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ)లో 3, 5 ఏళ్ల లా కోర్సుల్లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువుకునే ప్రతి అంశంపై సంపూర్ణ అవగాహన కలిగి, నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. నిత్యం తమను తాము పరీక్షించుకుంటూ ఎదిగేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వర్సిటీలోని అన్ని రకాల వసతులను సద్వినియోగం చేసుకుని, కోర్సులో నైపుణ్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

ప్రారంభోపన్యాసం చేసిన డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ఆచార్య డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ న్యాయ విద్యార్థి సమాజంపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే చట్టాలను సరిగా అర్థం చేసుకోగలడన్నారు. అందుకు ప్రతి విద్యార్థి సామాజిక, ఆర్థిక శాస్త్రాల మీద పట్టు సాధించి, సమాజాన్ని ఆ దృష్టితో పరిశోధించాలన్నారు. అప్పుడే విజయవంతమైన న్యాయవాదిగా రాణిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మదాసు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు



గాలిభీమవరంలో గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ను అడ్డుకుంటున్న ఎస్‌ఐ దివ్య, పోలీసులు

సబ్బవరం: మండలంలోని వుడా డెవలప్‌మెంట్ ప్లాట్ల(జగనన్న అర్బన్ హౌసింగ్ లేఅవుట్)లో చేపడుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలను సబ్బవరం పోలీసులు అడ్డుకున్నారు. గాలిభీమవరం రెవెన్యూ పరిధి సర్వే నెం.61లో మునగకొండ కొండవాలు ప్రాంతంలో గతంలో జగనన్న అర్బన్ హౌసింగ్ లేఅవుట్‌ను వేశారు. ఇక్కడ ఎలాంటి అనుమతుల్లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేపట్టడంతో స్థానికులు కొందరు నేరుగా పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ దివ్య తన సిబ్బందితో కలిసి గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న ప్రదేశాన్ని పరిశీలించి, తవ్వకాలను అడ్డుకోన్నారు. అనుమతుల్లేకుండా గ్రావెల్, మట్టి తవ్వకాలు, తరలింపు నేరమని, అనుమతులుంటే చూపాలన్నారు. అర్బన్ హౌసింగ్ లేఅవుట్‌లో ల్యాండ్ పూలింగ్‌లో తమకు ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేసుకుంటున్నట్లు తవ్వకాలు జరుపుతున్నవారు బదులిచ్చారు. వారి వద్ద అనుమతుల్లేకపోవడంతో గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేసి, అక్కడ నుంచి పోలీసులు వెనుదిరిగారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామ ప్రజలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శి రజినిపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ అనకాపల్లి పార్లమెంటరీ వర్కింగ్ కమిటీ మాజీ సభ్యుడు అరిజిల్లి అప్పలరాజు కోరారు. ఈ మేరకు పరవాడ ఎంపీడీవో రమేష్‌నాయుడుకు సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక టీడీపీ నాయకుడి సంతకం లేనిదే ఎలాంటి సర్టిఫికెట్లను జారీ చేయబోమని ఖరాకండీగా చెప్తున్నారని పేర్కొన్నారు. అధికారులు విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు.

డాక్టర్ రమేష్‌బాబుకి సత్కారం



వైద్య సిబ్బందితో డాక్టర్ రమేష్‌బాబు

పెదగంట్యాడ: పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా పని చేసిన డాక్టర్ రమేష్ బాబు సేవలు అద్భుతమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో పని చేసి బదిలీపై వెళ్లిన డాక్టర్ రమేష్‌బాబు అభినందన సభను పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా డాక్టర్ రమేష్‌బాబుతో పాటు బదిలీపై వెళ్లిన ఫార్మసిస్టు వెంకటవేణు, ఆరుగురు హెల్త్ సెక్రటరీలను సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పి.హేమలత, డాక్టర్ సంపత్ బాబు, నాయకులు పులి రమణారెడ్డి, ప్రసాదుల శ్రీనివాస్, ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చింతగట్లలో ప్రభుత్వభూమి కాపాడాలని వినతి



పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న చింతగట్ల నాయకులు

పెందుర్తి: కూటమి ప్రజాప్రతినిధుల అండతో కొందరు వ్యక్తులు పెందుర్తి మండలం చింతగట్లలోని ప్రభుత్వ భూమిని హస్తగతం చేసుకోవాలని చూస్తున్నారని ఆ గ్రామానికి చెందిన నాయకులు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశారు. ఇక్కడి సర్వే నెంబర్ 81/2లో దాదాపు 5 ఎకరాలను మారుతికుమార్ అనే వ్యక్తి పేరున ఫ్రీ హోల్డ్ చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని కలెక్టర్ హరేందిరప్రసాద్‌కు ఫిర్యాదు అందించారు. భూ బకాసురుల నుంచి రూ.కోట్లు విలువ చేసే భూమిని కాపాడి పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



యువతకు అవగాహన కలిగిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్, ఈవ్‌టీజింగ్ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు హితవు పలికారు. ముత్యాలమ్మపాలెంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాహనాలను అతి వేగంగా నడిపి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దన్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, యువత పాల్గొన్నారు.

ముగిసిన బీఎల్వోల శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఈఆర్వో శేషశైలజ

పెందుర్తి: భారత ఎన్నికల సంఘం, ఐఐడీఈఎం ఆదేశాల మేరకు పెందుర్తి నియోజకవర్గంలోని బూత్ లెవెల్ అధికారు(బీఎల్వో)లకు జరుగుతున్న శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఈఆర్వో శేషశైలజ మాట్లాడుతూ ఓట్ల నమోదు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రతి ఒక్కరూ చూడాలన్నారు. ఓటు హక్కు వయసు వచ్చిన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో చేరేలా అవగాహన కలిగించాలని సూచించారు. పలు అంశాలపై సూచనలు, సలహాలిచ్చారు. శిక్షణలో పాల్గొన్న బీఎల్వోలకు ధ్రువపత్రాలు అందించారు. ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ అర్జునరావు, అధికారులు, పెందుర్తి, సబ్బవరం, పరవాడ, పెదగంట్యాడ మండలాల నుంచి బీఎల్వోలు హాజరయ్యారు.

పట్టణంలో పందుల స్వైరవిహారం

- వ్యాధుల భయంలో ప్రజలు
- పట్టించుకోని జీవీఎంసీ యంత్రాంగం



పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తిరుగుతున్న పందులు



చినముషిడివాడ ప్రాంతంలో యథేచ్ఛగా సంచరిస్తున్న పందులు

పెందుర్తి: అసలే వానాకాలం.. దోమలు ఈగలతో రోగాలు విజృంభిస్తున్నాయి. ఈ క్రమంలో పలు రోగాలకు వాహకాలైన పందులతో కూడా యుద్ధం చేయాల్సిన దుస్థితి జోన్-8 పరిధిలో ఉన్న పది వార్డుల్లో నివాసం ఉంటున్న ప్రజలకు ఏర్పడింది. పట్టణ ప్రాంతాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా జనావాసాల్లో సంచరిస్తూ ప్రజల్లో భయాందోళనలు రేపుతున్నాయి. నివాసాల మధ్యలో ఉన్న మురుగును ఆవాసాలుగా చేసుకుని తిష్ట వేస్తున్నాయి. అకస్మాత్తుగా ఇళ్లల్లోకి చొరబడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎన్నో స్వల్ప, దీర్ఘకాలిక రోగాలకు కారకాలైన ఈ పందుల నియంత్రణలో జీవీఎంసీ యంత్రాంగం దారుణంగా విఫలమైందని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. విష జ్వరాలతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు నియంత్రణలోకి రాని తరుణంలో ఈ పందుల సంచారంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు పందుల పెంపకందారులకు పందుల వలన కలిగే నష్టాల గురించి వివరించి, వారిని ప్రత్యామ్నాయ జీవనోపాధి వైపు చైతన్యపరచడంలో కూడా యంత్రాంగం విఫలమవుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి పందుల నివారణకు జీవీఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీరు వృథా పట్టదా..

- మూడు నెలలు నుంచి పట్టించుకోని అధికారులు



పెద్దిళ్లు సమీపంలో ఏర్పడిన లీకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ నీటి సరఫరా అధికారుల నిర్లక్ష్యంతో పైపులైన్లకు ఏర్పడుతున్న లీకుల వల్ల వేల లీటర్లు తాగునీరు నిత్యం వృథాగా పోతుంది. నెలలు గడుస్తున్నా, ఫిర్యాదులు చేసినా లీకేజీలను అరికట్టడంలో అధికారులు విఫలం చెందుతున్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధి కొత్త దిబ్బపాలెం కదిరి పెద్దిళ్ల సమీపంలో,టింబర్ డిపో ప్రాంతాల్లో రెండు చోట్ల తాగునీటి పైపులకు లీకేజీలు ఏర్పడి సుమారు మూడు నెలలుగా వేల లీటర్ల తాగునీరు వృథాగా మురుగు కాలువల పాలవుతోంది. సమస్యపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు అందించేందుకు కుళాయిలు విప్పే సమయంలో ఈ నీరు వృథా మరింత ఉంటుందని వాపోతున్నారు. దీంతో పరిసర ప్రాంతాలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు గడువు పెంపు

పెదగంట్యాడ: ప్రభుత్వ ఐటీఐ గాజువాకలో ప్రవేశాల గడువును ఈ నెల 15 నుంచి 20 వరకూ పెంచామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ గడువు కూడా ఈ నెల 22 వరకూ పెంచామన్నారు. ఐటీఐలో 400 సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 23 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటి వరకూ 2వ కౌన్సెలింగ్ కోసం 1594 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. అందులో 1122 మంది మాత్రమే సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారని వివరించారు. మిగిలిన విద్యార్థులు కూడా తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు.

అనాథ పిల్లలకు పుస్తకాల అందజేత



నోట్‌పుస్తకాలు, బహుమతులు అందించిన విద్యార్థులు

అగనంపూడి: విజ్ఞాన్ మహిళా కళాశాల విద్యార్థులు మానసు అనాథాశ్రమాన్ని సందర్శించి విద్యార్థులకు కావాల్సిన నోట్ పుస్తకాలు అందించారు. తర్వాత పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి మాట్లాడుతూ ఇటువంటి ప్రదేశాల్లో పిల్లల బాగోగులు, నడవడిక, మానసిక స్థితిని అర్థం చేసుకోవడం ద్వారా సమాజంలో ఎలా మెసులుకోవాలని విద్యార్థులకు అలవడుతుందన్నారు. అలాగే కైలాసగిరిలోని డాప్లర్ వాతావరణ రాడార్ కేంద్రాన్ని విజ్ఞాన్ మహిళా కళాశాల విద్యార్థులు సందర్శించారు. మెటీరియాలజిస్ట్ జి.శ్రీనివాసరావు రాడార్ పని చేసే విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.